ప్రజాశక్తి
సోమవారం 18 ఆగస్టు 2025
5
విజయనగరం

నేడు పాఠశాలలకు సెలవు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా సోమవారం అన్ని ప్రభుత్వ, ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలకు ఒక రోజు సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం వర్షాల కారణంగా విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందులు, ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున, ముందు జాగ్రత్త చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ నిర్ణయాన్ని గమనించాలని ఆయన సూచించారు. వర్షాల కారణంగా ఎవరూ నిర్లక్ష్యం చేయకుండా తగిన ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

రెండు గేట్ల ద్వారా విడిచిపెడుతున్న మడ్డువలస ప్రాజెక్టు నీరు, ఉధృతంగా ప్రవహిస్తున్న నాగావళి నది

విస్తారంగా వర్షాలు

'మడ్డువలస'కు భారీగా వరదనీరు ● ఉధృతంగా ప్రవహిస్తున్న నాగావళి ● ఊపందుకున్న ఉబాలు

ప్రజాశక్తి-విలేకర్ల బృందం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా ఆదివారం విస్తారంగా వర్షాలు కురిశాయి. రోజంతా కురిసిన కుండపోత వర్షంతో పలుచోట్ల గెడ్డలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు నిండుకుండలా తయారయ్యాయి. మడ్డువలస రిజర్వాయరుకు వరదనీటి ప్రవాహం అధికం కావడంతో రెండు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. నాగావళి నది ఉధృతంగా ప్రవహి స్తోంది. కొత్తవలస మండలంలో 91.4 మి.మీ, మెంటాడలో 43 మి.మీ, వేపాడలో 42.4 మి.మీ, బాడంగిలో 40.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

విజయనగరం నగర, మండల పరిధిలో ఆదివారం రోజంతా వర్షం కురిసింది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండల పరిధిలో ఉబాలు ఊపందుకున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో మరో వారం రోజుల్లో మండలంలో ఉబాలు పూర్తవుతాయని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. **గజపతినగరం** మండలంలో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని భారీ వర్షం కురిసింది. భారీ వర్షాలతో మండలంలో చెరువులు, గెడ్డలు, నారుమడులు పొంగిపొర్లుతున్నాయి. గత కొంతకాలంగా వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా వరినాట్లు వేయడం కొంత ఆలస్యమైనా, ఈ వర్షాలతో ఉబాలు ఊపందుకున్నాయి. **వేపాడ** మండలంలో భారీ వర్షం కురిసింది. 42.4 మి.మీ వర్షం కురవడంతో చెరువులకు జలకళ వచ్చింది. మెరకపొలాల్లో వరినాట్లు పూర్తిచేసుకునే అవకాశం కలిగిందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. **బొబ్బిలి** పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మోస్తరు వర్షం పడింది. వరి నాట్లు వేసినప్పటి నుంచి వర్షం లేకపోవడంతో నాట్లు ఎండిపోయే స్థితికి చేరాయి. వర్షం వరినాట్లకు ఊపిరి పోసిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. **బాడంగి** మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. 40.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. వరినాట్లు ఎండిపోతున్న తరుణంలో వర్షం కురవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. **రేగిడి** మండలంలో సంకిలి, ఉంగరాడమెట్ట, బూరాడ, మజ్జి రాముడిపేట తదితర గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం నుంచి కుండపోత వర్షం పడింది. దీంతో రహదారులు జలమయం అయ్యాయి. గంటల తరబడి వర్షం పడడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. **శృంగవరపుకోట** మండలంలో ఆదివారం రోజంతా వర్షం కురిసింది. దీంతో చెరువులు నీటితో నిండుకుండలా మారి, జలకళను సంతరించుకున్నాయి. కొన్ని చెరువుల్లో అధికంగా నీరు వచ్చి చేరుతుండడంతో చట్టాల మీదుగా బయటకు ప్రవహిస్తున్నాయి.

గజపతినగరంలో కురుస్తున్న వర్షం

నిండుకుండలా మడ్డువలస

వంగర : మండలంలోని మడ్డువలస రిజర్వాయరు నిండుకుండలా మారింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సువర్ణముఖి, వేగావతి నదుల నుండి 7 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 65 మీటర్లు కాగా, ప్రస్తుతం 64.30 మీటర్లకు చేరింది. దీంతో ప్రాజెక్టు అధికారులు 10 వేల క్యూసెక్కుల నీటిని రెండు ప్రధాన గేట్ల ద్వారా దిగువకు విడిచి పెడుతున్నారు. దీంతోపాటు ఒడిశాలో కురుస్తున్న వర్షాలతో నాగావళి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. కుడి, ఎడమ కాలువల ద్వారా మరో 610 క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నట్లు ప్రాజెక్టు ఎఇ కె.నితిన్ తెలిపారు.

రేగిడిలో రోడ్డుపై చేరిన నీరు

విజయనగరంకోట.. ట్రాక్టర్‌తో దమ్ము పడుతున్న రైతు

అనుకున్నదంతా అయింది. టిడిపి కూటమి ప్రభుత్వం పింఛన్ల సొమ్ము పెంచినట్లే పెంచి.. పర్సంటేజీల షాక్‌తో వికలాంగుల పింఛన్లను తొలగించింది. కూటమి వచ్చీ రాగానే కొత్త పంథాకు తెరదీసి, వికలాంగులంతా మరోసారి వైద్యుల వద్దకు వెళ్లి సదరం ధృవీకరణ చేయించుకోవాలని షరతు పెట్టింది. వికలాంగత్వం ఎంత ఉందో వైద్యులతో ధృవీకరించి పర్సంటేజీతో సర్టిఫికెట్‌ను తీసుకు రావాలని కొత్త నిబంధనలను ప్రవేశపెట్టింది. దీంతో గత 20 ఏళ్లుగా పింఛను తీసుకుంటున్న వికలాంగులు ఒక్కసారిగా సదరం సర్టిఫికెట్లు కోసం సచివాలయాలు, ఆస్పత్రులకు పరుగులు పెట్టారు. రెండు మూడు వారాలు ముందే సచివాలయంలోని సదరం లాగిన్‌లో తమ పేరు బుక్ చేసుకుని వైద్యుని వద్దకు వెళ్లి మరోసారి తాను ఎంత అంగవైకల్యంతో ఉన్నానో నిర్ధారించి ధ్రువపత్రం ఇవ్వాలని కోరారు. అయితే ఇక్కడే అసలు కథ మొదలైంది. ప్రభుత్వం చెప్పిన విధంగా కోతకు సిద్ధంగా ఉన్న వైద్యులు ప్రతి ఒక్క వికలాంగుడికీ వైకల్య శాతం తగ్గించి ధ్రువపత్రాలు ఇచ్చారు. ఇప్పుడు వైకల్యం శాతం 40 కంటే తగ్గిందన్న షాకుతో చాలా మంది పింఛన్లను తొలగిస్తున్నారు. దీంతో వికలాంగులు లబోదిబోమంటున్నారు. ఏం చేయాలో తెలియక మళ్లీ సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు.



పింఛన్లు తొలగించారని ఆవేదన వ్యక్తంచేస్తున్న వికలాంగులు

వైద్యుల చేత.. పింఛన్ల కోత

● ఇష్టానుసారంగా సదరం సర్టిఫికెట్లు
● పర్సంటేజీ తగ్గించడంతో పింఛన్లు తొలగింపు
● ఆందోళన చెందుతున్న వికలాంగులు

ప్రజాశక్తి - వేపాడ

జిల్లా వ్యాప్తంగా వికలాంగుల పింఛన్ల కోతపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మేరకు సదరం సర్టిఫికేట్లలో వైకల్యం శాతం తగ్గిందన్న నెపంతో జిల్లాలో సుమారు 15వేల మందికి వికలాంగుల పింఛన్ల తొలగింపునకు రంగం సిద్ధం చేసింది. సెప్టెంబరులో వీరికి పింఛన్లు ఇవ్వమని ఇప్పటికే సచివాలయాల ద్వారా వికలాంగులకు సమాచారం ఇచ్చారు. దీంతో వికలాంగులు లబోదిబోమంటున్నారు. గత 20 ఏళ్లుగా ఇస్తున్న పింఛను ఇప్పుడు ఎందుకు ఇవ్వరని పలువురు వికలాంగులు ప్రశ్నిస్తున్నారు. అయితే వికలాంగత్వం 40 శాతం కంటే తక్కువ ఉన్నా 60 ఏళ్ల దాటిన వారికి వృద్ధాప్య పింఛను కింద రూ.4వేలు ఇచ్చేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో కొంత మంది వికలాంగులు ఊరట చెందుతున్నారు.

అప్పుడు అర్హులు.. ఇప్పుడు అనర్హులా?

2006లో అప్పటి సిఎం రాజశేఖర్‌రెడ్డి హయాంలో రూ.200 పింఛను తీసుకున్న వికలాంగులు అప్పుడు అర్హత సాధించి, ఇప్పుడు అర్హత లేదని చెప్పడం విడ్డూరంగా ఉంది. అప్పుడు, ఇప్పుడూ రెండు సార్లు తనిఖీలు చేసింది వైద్యులే. ఇప్పుడు అంగవైకల్యం తగ్గిందని ధృవీకరిస్తున్న ఈ డాక్టర్లది తప్పా.. లేకపోతే అప్పుడు అంగవైకల్యం తక్కువ ఉన్నా ఫేక్ సర్టిఫికేట్లు ఇచ్చారా అన్న అనుమానం వ్యక్తమవుతోంది. ఏదేమైనా గత 20 సంవత్సరాలుగా పింఛన్లు తీసుకుంటున్న వికలాంగులు ఇప్పుడు ఒక్కసారిగా అనర్హులు ఎలా అయ్యారని పలువురు ప్రశ్నిస్తున్నారు. కేవలం ప్రభుత్వం పింఛన్లు సొమ్ము పెంచిది కాబట్టి పింఛనర్ల సంఖ్యను తగ్గించుకోవడానికే వైద్యులకు సూచనలు ఇచ్చి పింఛన్లలో కోత విధిస్తోందని బహిరంగంగానే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఒక్కో చోట ఒక్కోలా..?

వికలాంగులంతా సదరం సర్టిఫికేట్లు చేయించుకోవాలని ప్రభుత్వం ఆదేశాలివ్వడంతో వారంతా సర్టిఫికేట్లు కోసం వైద్యులను ఆశ్రయించారు. చాలా చోట్ల వైద్యులు వికలాంగుల పట్ల సానుకూలంగానే స్పందించినా కొన్ని చోట్ల మాత్రం దురుసుగా వ్యవహరిస్తూ వైకల్యం శాతాన్ని అమాంతంగా తగ్గించేశారు. దీంతో పింఛన్లు పోయినట్లు తెలిస్తోంది.

గత వైద్యాధికారి ఇచ్చిన పత్రాలు చెల్లవట..

ఎస్‌కోట ఏరియా ఆసుపత్రిలో వికలాంగుల ధ్రువపత్రం పరిశీలనకు వచ్చిన వైద్యాధికారి గతంలో వైద్యాధికారి ఇచ్చిన వికలాంగుల ధ్రువ పత్రాలు చెల్లవని తేల్చేసినట్లు వికలాంగులు చెబుతున్నారు. అక్కడకు వెరిఫికేషన్‌కు వెళ్లిన చాలా మంది వికలాంగులకు ఆయన నిర్లక్ష్యంగా వికలాంగత్వం పర్సంటేజీలో కోత వేసినట్లు తెలిస్తోంది. కేవలం వేపాడ మండలంలోని బానాది, బల్లంకి, ఆతవ గ్రామాల్లో 21 చొప్పున, సింగరాయి పంచాయతీలో 51 పింఛన్లను తొలగిస్తున్నట్లు ఇప్పటికే నివేదికలను పంపించారు. దీంతో వైద్యాధికారి వ్యవహరించిన తీరుపై నేడు జిల్లా కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసేందుకు వికలాంగులు సిద్ధమవుతున్నారు.

ఇప్పుడెలా అనర్హుడిని అయ్యాను

నిరుపేద కుటుంబానికి చెందిన నేను రూ.200 ఇచ్చినప్పటి నుంచి పింఛను తీసుకుంటున్నాను. అప్పుడు అర్హత ఉండే నాకు ఇప్పుడు అనర్హుడునెలా అయ్యాను. నా చేయి సరిగా లేకపోవడం వల్ల నేను ఏ పనీ చేయలేను. అటువంటి నాకు వికలాంగత్వం తక్కువుగా ఉందని చూపి పింఛను తొలగించేస్తున్నారు. ఇది అన్యాయం. నాకు పింఛను ఇప్పించాలని కోరుతున్నాను.

- రాజేష్, వికలాంగుడు, బల్లంకి

ఒక కన్ను పూర్తిగా లేదు

నాకు ఒక కన్ను పూర్తిగా పనిచేయదు. 2011వ సంవత్సరం నుండి పింఛను పొందుతున్నాను. పలు మార్లు మహారాజా ఆసుపత్రికి ధ్రువీకరణ పత్రం విశీలనకు పిలిచారు. అప్పటి అధికారులెవరూ నాకు ఇచ్చిన ధ్రువపత్రాన్ని తప్పు పట్టలేదు. ఎస్‌కోట ఏరియా ఆసుపత్రిలో పరిశీలనకు వచ్చిన డాక్టర్ మాత్రం నేను పింఛనకు అనర్హుడనని తేల్చేసి సచివాలయానికి వచ్చిన జాబితాలో నా పేరు చేర్చారు. దృష్టి లోపం వల్ల నేను ఏ పనికీ వెళ్లలేను. నాకు మళ్లీ పింఛను కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలి.

గోకాడ రాము, వికలాంగుడు, బల్లంకి

మహాసభలో మాట్లాడుతున్న ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి

ఆశాలకు రూ.26 వేలు వేతనమివ్వాలి

ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని లోకబందు రెసిడెన్సీలో ఆదివారం ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాలుగో మహాసభ జరిగింది. ముందుగా సిఐటియు జెండాను ఆశా యూనియన్ నాయకులు లంక శాంతి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభలో ఆమె మాట్లాడుతూ దేశాన్ని అదానీకి అప్పగించేందుకు మోడీ, అమిత్ షా పని చేస్తే, రాష్ట్రాన్ని కూడా అదే వ్యక్తికి ఇచ్చేందుకు టిడిపి కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుందని విమర్శించారు. ఆంధ్ర రాష్ట్రాన్ని అదానీ రాష్ట్రంగా చంద్రబాబు ప్రభుత్వం మారుస్తోందని దుయ్యబట్టారు. అంతే తప్ప మిగతా సమస్యలేవీ ప్రభుత్వానికి పట్టడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆశా కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. మెటర్నిటీ సెలవులు 6 నెలలు ఇవ్వాలని, ఇన్సూరెన్స్ వర్తింపజేయాలని కోరారు. వీటితోపాటు వయోపరిమితి పెంచాలని ఆందోళన చేస్తే కూటమి ప్రభుత్వం కొన్ని హామీలను మాత్రమే అమలు చేసేందుకు ముందుకు వచ్చిందన్నారు. సమస్యలపై ఐక్యంగా పోరాటం చేయాలని ఆశా కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

అనంతరం ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా మహాలక్ష్మి, బి.సుధారాణి, కోశాధికారిగా ఎం.గౌరి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సుధారాణి, సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, నాయకులు సురేష్, యుటిఎఫ్ సీనియర్ నాయకులు కె.విజయగౌరి, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మహాలక్ష్మి, సుధారాణి

బొబ్బిలిలో భారీ ర్యాలీ

బొబ్బిలి పట్టణంలో ఆశా కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి భారీగా ఆశాలు చేరుకున్నారు. రైల్వే జంక్షన్ నుంచి లోకబందు రెసిడెన్సీ వరకు భారీ ర్యాలీ సాగింది. ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పర్మినెంట్ ఉద్యోగాలలో ఆశా కార్యకర్తలకు రిజర్వేషన్ ఇవ్వాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు.

పట్టణంలో ర్యాలీ చేపడుతున్న ఆశా కార్యకర్తలు

ఇప్పటికీ అరకొర సాగే

జిల్లాలో గడిచిన మూడు రోజులుగా భారీ వర్షాలు. మరోవైపు వరి నాట్లు వేసుకోవడానికి తగినంత నీరులేని గడ్డు పరిస్థితులు. వెరసి జిల్లాలో సగానికి సగం మండలాల్లో 50శాతం మించి వరి నాట్లు పడలేదు. మిగిలిన మండలాల్లోనూ ఇప్పుడిప్పుడే ముందుకు సాగుతున్నాయి. కొత్తవలస, విజయనగరం, బాడంగి, గుర్ల, నెల్లిమర్ల తదితర మండలాల్లో మొత్తం ఖరీఫ్ పంటలన్నీ కలిపినా 30 శాతానికి మించి సాగు కాలేదంటే పరిస్థితి ఎంతదారుణంగా ఉందో వేరేగా చెప్పనక్కర్లేదు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

● సగం మండలాల్లో 50శాతం మించని వరినాట్లు
● కొత్తవలస, విజయనగరం, బాడంగి, గుర్ల, నెల్లిమర్లలో గడ్డు పరిస్థితులు
● సాగునీటి వనరులను పట్టించుకోకపోవడమే కారణం

మన జిల్లాలో పెద్దగా సాగునీటి వనరులు లేకపోవడంతో వర్షాకాలం (ఖరీఫ్)లోనే ఎక్కువ పంటలు సాగవుతాయి. ఖరీఫ్‌తో పోలిస్తే రబీ పంటలు నామమాత్రమే. ఇంతటి ప్రాధాన్యత గల సీజన్‌లో ఈ ఏడాది తొలి నుంచీ వర్షాలు కురుస్తున్నప్పటికీ సాగు విషయంలో భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఖరీఫ్‌లో ప్రధానంగా వరి, మొక్కజొన్న, పత్తి, చెరకు, నువ్వులు తదితర పంటలు సాగవుతాయి. మినుములు, పెసలు, కందులు తదితర అపరాలను అంతర పంటలుగా వేస్తారు. ఇందులోనూ ఈ ఏడాది వరి అత్యధికంగా 2,28,035 ఎకరాల్లో పడుతుందని అధికారులు అంచనా వేయగా, ఇప్పటి వరకు 1,19,075 ఎకరాల్లో మాత్రమే నాట్లు పడ్డాయి. ఇందులో వంగర, రామభద్రపురం, రాజాం, తెర్లాం మండలాల్లో ఎక్కువగా సాగైనట్టుగా కనిపిస్తోంది. కొత్తవలస మండలంలో 2,228 ఎకరాలకు గాను ఇప్పటి వరకు కేవలం 195 ఎకరాల్లో మాత్రమే నాట్లు పడ్డాయి. విజయనగరం మండలంలో 3,922 ఎకరాలకు గాను 910 ఎకరాల్లోనూ, బాడంగిలో 7,007 ఎకరాలకు గాను 1,122 ఎకరాల్లోనూ, గుర్ల మండలంలో 9,007 ఎకరాలకు గాను 1520 ఎకరాల్లోనూ వరి నాట్లు పడ్డాయి. మరో పది మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. తాటిపూడి జలాశయం ఉన్న గంట్యాడ మండలంలో అన్ని పంటలూ కలుపుకుని కూడా 39 శాతానికి మించి సాగులేదు. దత్తిరాజేరులో వరి, మొక్కజొన్న, పత్తి, నువ్వులు తదితరాలు కలుపుకుని 35 శాతానికి పరిమితమయ్యాయి. బొబ్బిలి, మెరకముడిదాం, వేపాడ, సంతకవిటి మండలాల్లో పంటల సాగు సగం వరకు సాగింది. రెండో ప్రాధాన్యత పంటగా ఉన్న మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 30,965 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 24,310 ఎకరాల్లో సాగైంది. నువ్వుల సాగు సాధారణ విస్తీర్ణం 13,962 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 9,842 ఎకరాల్లో పడింది. పత్తి సాగు విస్తీర్ణం 5,355 ఎకరాలు కాగా సాగు విస్తీర్ణం ప్రస్తుతం 4,157 ఎకరాలు (78 శాతం) సాగైంది. చెరకు సాగుమాత్రం మందకొడిగా కనిపిస్తోంది. సాధారణ విస్తీర్ణం 11,800 ఎకరాలకు గాను ఇప్పటి వరకు కేవలం 5,695 ఎకరాల్లో (48 శాతం) మాత్రమే సాగైంది. గతేడాది ఈ సమయానికి 5,747 ఎకరాలు (77 శాతం) సాగు ఉండేది.

ఇంకా నాట్లు వేయని పొలం

సాగునీటి వనరులు లేక భిన్నమైన పరిస్థితులు

ఓవైపు ఖరీఫ్ ప్రారంభం నుంచీ వర్షాలు కురుస్తున్నా సాగునీటి వనరులు పెద్దగా లేకపోవడం, ఉన్న ప్రాజెక్టులు, కాలువల నిర్వహణ గాలికి వదిలేయడమే జిల్లాలో భిన్నమైన పరిస్థితులకు కారణం. వాస్తవానికి చీపురుపల్లి, గుర్ల, పూసపాటిరేగ మండలాలకు తోటపల్లి నీరు అందాల్సి ఉంది. కాలువల్లో పూడిక తీయకపోవడం వల్ల చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదు. ఇలా అన్ని జలాశయాల వద్ద ప్రభుత్వ లోపాలు ఉన్నాయి. దీంతో, ఆయకట్టు భూముల్లో కూడా పూర్తిస్థాయిలో నాట్లు పడలేదు. దత్తిరాజేరు, కొత్తవలస, విజయనగరం, భోగాపురం, తదితర మండలాల్లో పూర్తిగా నీటి వనరులే లేవు.

అల్లోపతికి దీటుగా ఆయుష్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

● దుష్ప్రభావాలు లేకుండా వైద్య సేవలు
● వ్యాధి ముందస్తుగా రాకుండా.. నివారణకు మందులు
● సిబ్బంది కొరత వాస్తవమే
● 'ప్రజాశక్తి'తో జిల్లా ఆయుష్ శాఖాధికారి బట్టు వరప్రసాద్ ముఖాముఖి

జిల్లాలో అల్లోపతికి దీటుగా ఆయుష్ శాఖ ద్వారా రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు జిల్లా ఆయుష్ శాఖాధికారి బట్టు వరప్రసాద్ తెలిపారు. ఆయుష్ వైద్యంలో హోమియోపతి, ఆయుర్వేదిక్ నేచురోపతి, యునాని, సిద్ధ విభాగాలు ఉంటాయని తెలిపారు. ఆయుష్ వైద్యంలో సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా మందులు అందిస్తున్నామన్నారు. కాలానుగుణంగా వచ్చే రోగాలకు వైద్య సేవలను అందిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని ప్రజలందరూ ఆయుష్ శాఖ ద్వారా అందించే వైద్య సేవలను పొందాలని సూచించారు. గతంలో కంటే ఆయుష్ వైద్యం పొందేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...



ఆయుష్ శాఖలో ఎన్ని విభాగాలు ఉంటాయి? వైద్యం ఎలా అందిస్తారు.?

ఆయుష్ శాఖలో ఆయుర్వేదిక్, హోమియోపతి, యునాని, నేచురోపతి, సిద్ధ అనే విభాగాలున్నాయి. వీటి ద్వారా వైద్య సేవలు అందిస్తున్నాం. విజయనగరం జిల్లాలో సిద్ధ అనే విభాగం ద్వారా వైద్య సేవలు లేవు.

జిల్లాలో ఆయుష్ ఆసుపత్రులు ఎన్ని? వాటి వివరాలు.?

జిల్లాలో ఆయుర్వేదిక్ విభాగంలో 16 ఆసుపత్రులు, హోమియోపతి విభాగంలో 16 ఆసుపత్రులు, యునాని విభాగంలో రెండు, నేచురోపతిలో రెండు ఆసుపత్రులు ఉన్నాయి. బల్లంకి, కొత్తవలస, లక్కవరపుకోట, రాకోడు, విజయనగరం, గజపతినగరం, డెంకాడ, గరివిడి, గుర్ల, గర్భాం, సతివాడ, మామిడిపల్లి, పూసపాటిరేగ, పెదమేడపల్లిలో హోమియోపతి ఆసుపత్రులు ఉన్నాయి. ఆయుర్వేదిక్ విభాగంలో విజయనగరం, భీమాలి, వేపాడ, శృంగవరపుకోట, కెల్ల, జామి, మెంటాడ, రామభద్రపురం, బొద్దాం, బాడంగి, పెరుమాలి, సంకిలి, బూసాయివలస, కోమటిపల్లి, భోగాపురం, బొబ్బిలి ప్రాంతాల్లో ఆస్పత్రులు ఉన్నాయి. నేచురోపతి ఆస్పత్రులు విజయనగరం, గుర్లలో, యునాని ఆస్పత్రులు విజయనగరం, భోగాపురం ప్రాంతాల్లో ఉన్నాయి.

ఆయుష్ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది, మందుల కొరత ఉందా.?

జిల్లాలో హోమియోపతి, యునాని, నేచురోపతి విభాగాల్లో మందుల కొరత లేదు. ఆయుర్వేదిక్‌లో కొన్ని ఆసుపత్రుల్లో మాత్రమే మందుల కొరత ఉంది. ప్రతిపాదన పెట్టారు. త్వరలో వచ్చే అవకాశం ఉంది. ఆయుర్వేదిక్ విభాగంలో వైద్యుల కొరత లేదు. సిబ్బంది సగానికి పైగా ఉంది. హోమియోపతిలో వైద్యుల కొరతలేదు, సిబ్బంది సగానికి పైగా ఉంది. యునాని, నేచురోపతి విభాగాల్లో ఒక్కొక్క వైద్యుని కొరత ఉంది.

ఆయుష్ ఆసుపత్రుల్లో రోజుకు ఎంతమంది రోగులు వస్తున్నారు.?

ఆయుష్ విభాగంలో గతంలో కంటే రోగులు ప్రస్తుతం ఎక్కువగానే ఆసుపత్రులకు వస్తున్నారు. జిల్లాలో ఉండే నాలుగు విభాగాల్లో ఆసుపత్రులకు రోగులు ప్రతిరోజూ 40 నుంచి 50 మంది ఒపి ఉంటోంది. ప్రతి ఒక్కరికి అన్ని రకాల రోగాలకు వైద్య సేవలు, మందులు ఉచితంగా అందిస్తున్నాం. ప్రజలు ఎటువంటి అపోహలూ లేకుండా వైద్య సేవలు పొందాలి. అల్లోపతికి దీటుగా ఆయుష్ వైద్యాన్ని జిల్లాలో ప్రజలకు అందిస్తున్నాం. కాలాగుణంగా వస్తున్న వ్యాధులతోపాటు దీర్ఘకాలిక వ్యాధులకు, అన్ని రకాల రోగాలకు వైద్య సేవలు అందిస్తున్నాం. శస్త్రచికిత్సలు తప్ప సాధారణ మనిషి వచ్చే అన్ని జబ్బులకు ఆయుష్‌లో వైద్య సేవలు అందుతాయి. గ్రామాల్లో వారానికి ఒకసారి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా మందులు, వైద్యం అందిస్తున్నాం. ప్రజల్లో ఉన్న అపోహలను తొలగిస్తున్నాం.

సాంబశివరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు

ఘనంగా పెనుమత్స జయంతి వేడుకలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

దివంగత మాజీ మంత్రి పెనుమత్స సాంబశివరాజు 92వ జయంతి వేడుకలు ఆదివారం మొయిద విజయరాంపురంలో ఆయన కుమారుడు ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్ బాబు, మనమలు పెనుమత్స సంతోష్ బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్మృతి వనంలో స్వర్గీయ సాంబశివ రాజుకి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సాంబ శివరాజు ఆయన హయాంలో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి బాటలో నడిపించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు కె.వి. సూర్యనారాయణ రాజు, వైసిపి నాయకులు అంబళ్ళ శ్రీరాములు నాయుడు, డి. గిరిబాబు, కె. హర్ష వర్ధన్ రాజు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, రేగాన శ్రీనివాసరావు, వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ నాయకులు ధవళ లక్ష్మణరావు, సర్పంచ్ ఆల్లాడ కృష్ణ, సర్పంచులు, ఎంపిటిసిలు, పెనుమత్స కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కంటి తనిఖీ చేస్తున్న వైద్యురాలు

కొండరాజుపేటలో నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని కొండరాజుపేట సచివాలయం వద్ద ఆదివారం సర్పంచ్ సరగడ బంగారు రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నియో స్కిన్ కేర్ వైద్యులు నేత్ర పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సరగడ కళ్యాణి, మనోహర్ రెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులపై వేధింపులు దారుణం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

కూటమి నాయకులు మహిళా ఉద్యోగులపై వేధింపులు దారుణమని జైభీం భారత్ పార్టీ నాయకులు టొంపల నరసయ్య, కనిగిరి శ్రీనివాసరావు, చిన్నం అరుణ్ కుమార్ అన్నారు. ఆదివారం వారు నెల్లిమర్లలో విలేకర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన తరువాత నాయకులు, అనుచరులు మహిళలను వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో వేధింపులతో గర్భిణి ఆత్మహత్యకు పాల్పడిందని, తాజాగా శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవి కుమార్ కేజీబివి ప్రిన్సిపాల్ ఆర్. సౌమ్యపై వేధింపులకు పాల్పడి మానసికంగా హింసకు గురి చేయడం దుర్మార్గమని అన్నారు. ఇటువంటి వేధింపులకు పాల్పడుతున్న వారిపై ఎస్సి, ఎస్టి అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పిఎసిఎస్ అధ్యక్షులను సత్కరిస్తున్న టిడిపి నాయకులు

పిఎసిఎస్ అధ్యక్షుల ప్రమాణ స్వీకారం

తెర్లాం : మండలంలోని పెరుమాలి, నందిగాం, తెర్లాం పిఎసిఎస్ అధ్యక్షులుగా కుచ్చర్లపాటి వెంకటజగ్గరాజు, రమణ, నర్సిపల్లి వెంకటేశ్వరరావు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ నాయకులు ఎమ్మెల్యే బేబినాయన, బుడా చైర్మన్ తెంటు రాజా ఆశీస్సులతో తమకు ఈ పదవులు వచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. తమకు అప్పజెప్పిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి ఎఎంసి చైర్మన్ నర్సిపల్లి వెంకటనాయుడు, కుచ్చెర్లపాటి శివప్రసాద్‌రాజు, పెరుమాలి సర్పంచ్ ప్రతినిధి అప్పల నరసింహారాజు, తెర్లాం ఎంపిటిసి జి ఆనందరావు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

లోకేష్‌తో వాజీ ఛానల్ ఎమ్‌డి గణపతినీడి భేటీ

విజయనగరం కోట : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను వాజీ ఛానల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిలో ప్రత్యేకంగా ఆయన లోకేష్‌తో భేటీ అయ్యారు. ఉత్తరాంధ్ర లోని రాజకీయ పాలనాపరమైన అంశాలపై లోకేష్‌తో చర్చించారు. విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం జిల్లాల కూటమి ప్రభుత్వ పాలన, రాజకీయ పరిణామాలపై చర్చించారు. అనంతరం యువ గళం పాదయాత్రలో అనుభవాల పుస్తకాన్ని నారా లోకేష్ ,గణపతినీడి శ్రీనివాసరావు కు బహుకరించారు.

పుస్తకాన్ని అందిస్తున్న శ్రీనివాసరావు

పింఛన్ల పరిశీలన

శృంగవరపుకోట : దీర్ఘకాలిక అనారోగ్యంతో మంచానికే పరితమై పింఛన్లు పొందుతున్న వారి ఇంటికి డాక్టర్ల బృందం వచ్చి వెరిఫికేషన్ చేస్తారని ఎంపిడిఒ సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ మంచానపడ్డ దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు సర్టిఫికెట్లు వెరిఫికేషన్‌లో 85శాతం కంటే తక్కువ 40 శాతం కంటే ఎక్కువ వ్యాధి పర్సంటేజ్ ఉన్నట్టయితే వారికి ఇప్పుడు ఇస్తున్న 15 వేల నుండి రూ.6 వేలకు పింఛను తగ్గిస్తారన్నారు. 40శాతం కంటే తక్కువ పర్సంటేజ్ ఉండి 60 ఏళ్లు దాటితే నాలుగువేల పింఛన్ ఇస్తారన్నారు. వయస్సు 60 ఏళ్ల కంటే లోపు ఉంటే అటువంటి పింఛను రద్దు చేస్తారని చెప్పారు. ఈ నెల 25వ తేదీలోపు ఈ ప్రక్రియంతా పూర్తి చేస్తారన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

రామభద్రపురం : మండల కేంద్రంలోని శ్రీరామనగర్ కాలనీకి చెందిన గోర్జి రమేష్ (44) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్ఐ వెలమల ప్రసాదరావు తెలిపారు. ఈ నెల 15వ తేదీన కడుపునొప్పి తాళలేక చినమ్మతల్లి గుడి దగ్గర పురుగు మందు తాగినట్లు కనుగొన్న బంధువులు బాడంగి ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం నిమిత్తం అక్కడి నుంచి విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి 16న తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

జూదం, కోళ్ల పందేలపై కఠిన చర్యలు

కంటోన్మెంట్: జిల్లాలో జూదం, కోడి, గొర్రె పందేలు నిర్వహిస్తే, వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌పి వకుల్ జిందల్ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిత్యం నిఘా పెట్టి, మరింత విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు పేకాట ఆడుతూ పట్టుబడ్డ 1031 మందిపై 141 కేసులు నమోదు చేసి, రూ.24,07,398 నగదును స్వాధీనం చేసుకున్నానుని చెప్పారు. కోడి పందేలు ఆడుతూ పట్టుబడ్డ 174 మందిపై 35 కేసులు నమోదు చేసి, రూ.1,13,679 నగదు, 75 కోళ్లను, 4 పొట్టేళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ప్రజలు విజ్ఞతతో వ్యవహరించాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొనవద్దని కోరారు.

పరదాల మాటున పక్కా భవనం

- సెలవు రోజుల్లో పనులు
- ప్రధాన సూత్రధారులు రెవెన్యూ సిబ్బందే

రాజు తలచుకుంటే కొరడా దెబ్బలకు కొదవే లేదన్నది సామెత. సామెత పాతదే అయినా, ప్రస్తుతం మండలంలో రెవెన్యూ అధికారుల తీరుకు అద్దం పడుతోంది. అధికారులు తలచుకుంటే ఆక్రమణలకు అడ్డే లేదని మరోసారి నిరూపితమైంది. మండలంలోని కాపుసోంపురం-1 వద్ద గెడ్డ పోరంబోకు స్థలాన్ని ఆక్రమించి నిర్మిస్తున్న ఇంటిపై, పునాదుల స్థాయి నుంచి స్థానికులు ఫిర్యాదులు చేస్తున్నా పెడచెవిన పెట్టడం అందుకు తార్కాణం. 'నోటీసులు ఇచ్చాం.. ఇక నిర్మాణం జరగదు..' అంటూ అధికారులు కాలయాపన చేస్తుంటే, ఆక్రమణదారుడు పరదాల మాటున ఇంటి నిర్మాణాన్ని చకచకా పూర్తిచేస్తుండటం గమనార్హం.

ప్రజాశక్తి-శృంగవరపుకోట

వర్షాలతో మండలంలోని పుణ్యగిరి కొండల నుంచి జాలువారే నీటితో ప్రవహించే మూలపుకట్టు గెడ్డ.. విశాఖ - అరకు రహదారి, కాపుసోంపురం-1 గ్రామాన్ని ఆనుకుని ప్రవహిస్తూ గంటవాని చెరువులో కలుస్తుంది. ఈ చెరువు నీటితో కింద సుమారు 200 ఎకరాలు సాగవుతాయి. అక్కడి నుంచి కాపుగెడ్డ గుండా సీతమ్మపేట, పోతవలస గ్రామాల్లో చెరువులను నింపుతూ జామి మండలం జాగారం వద్ద గోస్తనీ నదిలో కలుస్తుంది. విశాఖ-అరకు జాతీయ రహదారిని ఆనుకొని ప్రవహిస్తున్న మూలపుకట్టు గెడ్డ పోరంబోకు భూమిని ఆక్రమించిన ఒక వ్యక్తి ముందుగా పశువుల పాకను నిర్మించాడు. ఆ తర్వాత పరదాలు కట్టి పక్కా భవనం నిర్మాణాన్ని చేపట్టాడు. పునాదుల దశలోనే స్థానికులు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే, మండలంలో ఇరిగేషన్ అధికారులు ఉన్నారో? లేరో? తెలియని పరిస్థితి. ఆక్రమణపై గతంలో ప్రజాశక్తిలో కథనం రావడంతో రెవెన్యూ అధికారులు ఆక్రమణదారుడికి నోటీసులు ఇచ్చామని చెప్పారు. ఇకపై నిర్మాణాన్ని చేపట్టనని ఆక్రమణదారుడు లిఖితపూర్వకంగా రాసిచ్చాడని వారు తెలియజేశారు. అయినా, ఆక్రమణదారుడు నిర్మాణాన్ని ఆపకుండా పలు దఫాలుగా శ్లాబ్ స్థాయి వరకు చేపట్టాడు. రోడ్డుపై వెళ్ళేవారికి కనబడకుండా పరదాలు కట్టి, పని పూర్తి చేశాడు. ఈ విషయాన్ని స్థానికులు రెవెన్యూ అధికారులకు తెలియజేసినా చర్యలకు పూనుకోలేదు.

గెడ్డ పోరంబోకు భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వ్యక్తికి నోటీసులు జారీ చేశామని, అయినా వాటిని తొలగించకుంటే తామే జెసిబితో తొలగిస్తామని గత తహశీల్దార్ కిరణ్ కుమార్ ప్రకటించారు. ఆ తరువాత నిర్మాణం పూర్తయింది. గెడ్డ పోరంబోకు స్థలం ఆక్రమించి నిర్మించిన ఇంటిపై ఇప్పుడున్న తహశీల్దార్ శ్రీనివాసరావు ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

సూత్రధారి విఆర్ఒ!

గెడ్డపోరంబోకు స్థలాన్ని ఆక్రమించి, నిర్మాణం చేపట్టడానికి విఆర్ఒ సహకారం అందిస్తున్నారని కాపుసోంపురం-1 గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గెడ్డ పోరంబోకు స్థలాన్ని ఆక్రమించి ఇంటిని నిర్మిస్తున్న సమాచారాన్ని తహశీల్దార్‌కు తెలియనివ్వకుండా విఆర్ఒలే నిర్మాణదారుడిని ప్రోత్సహిస్తున్నారని చెబుతున్నారు.

జల వనరులను కాపాడాలి

తాగు, సాగునీరు అందించే జల వనరులను ఆక్రమణలకు గురికాకుండా రెవెన్యూ అధికారులే కాపాడాలి. మండలంలోని ఆక్రమణలకు గురవుతున్న గెడ్డలు, గెడ్డ పోరంబోకు భూములు, వాగులు, చెరువులను గుర్తించి వాటిని పరిరక్షించాలి.

- గాడి అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

నిర్మాణం బయటికి కనిపించకుండా అడ్డుగా వేసిన పరదా

ఎన్నాళ్లీ గుంతల ప్రయాణం

- అధ్వానంగా మజ్జి రాముడుపేట రోడ్డు
- గుంతలమయంగా పాలకొండ, రాజాం రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని మజ్జి రాముడుపేట, ఉంగరాడ మెట్ట వద్ద ప్రధాన రహదారి పెద్ద పెద్ద గుంతలమయమైంది. వీటికి వర్షాలు తోడై ప్రధాన రహదారి బురదమయం కావడంతో ప్రయాణం ఎలా అని పాదచారులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజాం - పాలకొండ ప్రధాన రహదారిలో రెండేళ్ల క్రితం సిసి రోడ్డు మంజూరైంది. రెండేళ్ల పూర్తయిన సిసి రోడ్డు వేయకపోవడం రోడ్డు గుంతలమయమైంది. తారు రోడ్డులో గుంతలు ఏర్పడటం, గుంతలను పూడ్చడానికి ఈ రోడ్డుపై గ్రావెల్ వేయడం దీనికి తోడు వర్షాలు పడడంతో పూర్తిగా బురదమయం కావటంతో వాహనదారులు జారిపడి గాయాల పాలవుతున్నారు. ఆర్‌టిసి బస్సులు, లారీలు, ఆటోలు ఈ రోడ్డులో ప్రయాణం చేయడంతో ఊయాల- కంబాల అనే సామెత గుర్తుకొస్తుంది. పాలకొండ - రాజాం మీదుగా చీపురుపల్లి, విజయనగరం, విశాఖపట్నం ప్రధాన రహదారి అయినప్పటికీ గుంతలమయమైన రోడ్డుపై ప్రయాణించడం నరకంగా ఉందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మజ్జి రాముడిపేట వద్ద ప్రధాన రహదారి బురదమయం కావడంతో కొమిరి, లక్ష్మీపురం, ఆడవరం, ఖండ్యాం గ్రామాలకు వెళ్లే ప్రయాణకులు, పాదాచారులు వాహనాల ద్వారా మజ్జి రాముడు పేట పురవీధుల్లో వెళ్లడం ట్రాఫిక్ పెరిగి చిన్నారులకు ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా పాలకొండ విశాఖపట్నం ప్రధాన రహదారిలో ఆర్‌టిసికి అధిక మొత్తంలో రెవెన్యూ వచ్చినప్పటికీ ప్రధాన రహదారి మరమ్మతులకు ఆర్ అండ్ బి అధికారులు పట్టించుకోకపోవడం నానా పాట్లు పడుతున్నామని ఆయా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్, అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతున్నారు.

గోతుల మయంగా పాలకొండ-రాజాం ప్రధాన రహదారి

అధ్వానంగా మజ్జి రాముడుపేట రోడ్డు

జడ్జి దంపతులను ఆహ్వానిస్తున్న నాయకులు

సంగమేశ్వర ఆలయాన్ని దర్శించుకున్న హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి - వంగర

హైకోర్టు నూతన జడ్జి గేదెల తుహిన్‌కుమార్ దంపతులు మండలంలోని సంగాంలో గల సంగమేశ్వరున్ని ఆదివారం దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆయనకు ముందుగా ఆలయ అర్చకులు, మండల ప్రజా ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, బొత్స వాసుదేవరావు నాయుడు, పైల వెంకటరమణ, ఆలయ చైర్మన్ బోను ఆనంద రావు, సిద్ధాంతం గణపతిరావు, పాల్గొన్నారు.

తాగునీటి కోసం నిరసన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బానాదిలో తాగునీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిటిసి గొంప తులసీ మాట్లాడుతూ గ్రామంలో ఇంటింటికీ తాగునీరు అందించాలనే లక్ష్యంతో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేశారన్నారు. అయితే గొంపవారి వీధిలో ఇంటింటికీ తాగునీరందిస్తామని గతంలో వేసిన కుళాయిలను తొలగించి బాగా ఉన్న సీసీ రోడ్డును తవ్వేసి కుళాయిలు వేసినప్పటికీ గత ఐదేళ్లుగా తాగునీటిని మాత్రం సరఫరా చేయలేదన్నారు. ఈ విషయంపై పలుమార్లు స్పందనలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. గ్రామ సర్పంచ్ కూడా పట్టించుకోకపోవడంతో నిరసనకు దిగామన్నారు. ఈ వీధి టిడిపి వర్గానికి చెందినదని గ్రామ సర్పంచ్ వైసిపికి చెందిన వ్యక్తి కావడంతో ఈ వీధికి తాగునీటి సరఫరా లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. నిధులు టిడిపి వర్గం ఉన్న వీధికి మాత్రమే మంజూరు కాకపోవడం, మిగతా పార్టీ వీధులకు మంజూరవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని హెచ్చరించారు. సీనియర్ న్యాయవాది గొంప వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

చిన్నారులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలోని కునాయవలస గ్రామంలో ఎస్‌టి కుటుంబానికి చెందిన చిన్నారులు గిన్నిపల్లి శ్రీవల్లి (9), గిన్నిపల్లి శైలజా (7)లకు గ్రామానికి చెందిన తెలుగు దేశం పార్టీ నాయకులు, యువత ఆదివారం రూ.28వేలు నగదును ఆర్థిక సాయంగా అందించారు. వీరి తల్లి వరలక్ష్మి నాలుగేళ్ల క్రితం చనిపోగా, తండ్రి శివ గత జూలై 20న అకస్మాత్తుగా మరణించారు. దీంతో పిల్లలిద్దరూ అనాథులై నిరుపేద నాయినమ్మ సంరక్షణలో బతుకుతున్నారు. విషయం తెలుసుకున్న గ్రామ టిడిపి నాయకులు తమవంతు సహకారంగా నగదు అందించారు. భవిష్యత్తులో చిన్నారుల చదువు విషయంలో తమ వంతు సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉంటామని అక్కాచెల్లెళ్ళుకు ఆత్మవిశ్వాసం కలిపించి ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బోనెల సింహాసనం, మాజీ ఎంపిపి బోనెల రవి, యువ నాయకులతో పాటు, యువత, కార్యకర్తలు, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆర్థిక సాయం అందిస్తున్న టిడిపి నాయకులు

ఉచిత బస్సు ప్రయాణంపై అవగాహన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలలో ఒకటైన శ్రీ శక్తి మహిళలకు రాష్ట్రమంతా ఉచిత బస్సు ప్రయాణం ఆగస్టు 15 నుంచి ప్రారంభించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ఆదివారం పట్టణంలోని ఎస్.కోట ఆర్‌టిసి డిపో పరిధిలో గల బస్సులలో వుమెన్ ఫ్రీ ట్రావెల్ విషయమై జీరో టిక్కెట్ జారీ మీద మహిళా ప్రయాణికులకు అవగాహన కల్పించామని డిసి జిఎస్ రాజు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా అరుకు రూట్‌లో బొడ్డవర వద్ద, విశాఖ రూట్లో బొద్దాం వద్ద, విజయనగరం రూట్లోనూ బస్సులో ఉచితంగా ప్రయాణిస్తున్న మహిళలకు ఉచిత ప్రయాణంపై అవగాహన కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంట్రోలర్ వివి రమణ, సూపర్వైజర్, డిపో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

వీరమహిళల సేవలు వెలకట్టలేనివి : యశస్వి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

వీర మహిళల సేవలు వెలకట్టలేనివని తూర్పు కాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్వి తెలిపారు. జిల్లా చిరంజీవి యువత, అంజనీ పుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్, అంజనీ పుత్ర చిరంజీవి బ్లడ్ డోనర్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పాల్ నగర్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన వీరమహిళలకు సన్మానాలు చేశారు. ఈ సందర్భంగా రీజనల్ కో ఆర్డినేటర్ తుమ్మి లక్ష్మీరాజ్, మాత గాయత్రి, గంట్లాన పుష్పకుమారి, అడబాల మాధవి, లక్ష్మి, పద్మ, సోమాదుల ఆదిలక్ష్మిని పాలవలస యశస్వి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా చిరంజీవి యువత అధ్యక్షులు త్యాడ రామకృష్ణారావు, జనసేన నాయకులు లాలిశెట్టి రవితేజ, లోపింటి కళ్యాణ్, దాసరి యోగేష్, అడబాల ప్రసాద్, సోమాదుల తారకేశ్వరరావు పాల్గొన్నారు.

యశస్విని సత్కరిస్తున్న జనసేన నాయకులు

జోరువానలో జిందాల్ నిర్వాసితుల నిరసన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జిందాల్ పరిశ్రమ కోసం సేకరించిన భూములను తిరిగి తమకు అప్పగించాలని సిపిఎం ఆధ్వర్యాన నిర్వాసితులు చేపట్టిన నిరసన కొనసాగుతోంది. ఆదివారం 56వ రోజు బొడ్డవరలో జోరువానలోనూ నిర్వాసితులు నిరసన చేపట్టారు. వినూత్న రీతిలో నోటికి నల్లరుమాలు అడ్డంగా కట్టుకుని నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు చల్లా జగన్ మాట్లాడుతూ 56 రోజులుగా వివిధ రూపాల్లో నిరసన చేపడుతున్నా ప్రభుత్వం నుంచి గానీ, యాజమాన్యం నుంచి గానీ స్పందన లేకపోవడం దారుణమన్నారు. సాధారణ రోజుల్లో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు గిరిజన, దళితుల కోసమే పనిచేస్తున్నామని ఊపదంపుడు ఉపన్యాసాలిస్తుంటారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉద్యోగాలు రాక, భూములు కోల్పోయి ఆదాయం లేక నిర్వాసితులు ఆకలితో అలమటిస్తుంటే పట్టించు కోకపోవడం సిగ్గుచేటన్నారు. అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేసే అధికారం జిల్లా కలెక్టర్‌కు అప్పగించిన నేపథ్యంలో జిందాల్ ప్రాంతంలో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్లు అన్ని రద్దుచేసి, సర్వం కోల్పోయిన నిర్వాసితులకు భూమిని అప్పగించాలని డిమాండ్ చేశారు.

ధర్నా చేస్తున్న గిరిజనులు

20న న్యాయ సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం

సెప్టెంబర్ 20న రామాయణ శంఖారావంలో భాగంగా న్యాయ సదస్సు నిర్వహిస్తున్నట్లు రామనారాయణం ట్రస్టు చైర్మన్ నారాయణం నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు న్యాయ సదస్సు పోస్టర్‌ను హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వి రమణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరంలోని రామనారాయణంలో 'వాల్మీకి రామాయణంలోని నైతిక, ధార్మిక బోధనలు, రాజ్యాంగంలోని న్యాయం, ధర్మం, సమానత్వం, మానవ గౌరవం'పై న్యాయ సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సదస్సుకు న్యాయమూర్తులు, వైస్ ఛాన్సలర్లు, ప్రొఫెసర్లు, ప్రముఖ న్యాయవాదులు, న్యాయ విద్యార్థులు హాజరుకానున్నట్లు వివరించారు.

పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎన్‌వి రమణ

జిల్లా కబడ్డీ జట్లలో 'సత్య' విద్యార్థులకు చోటు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

యువ ఆంధ్రా ఛాంపియన్‌షిప్ కోసం ఎంపిక చేసిన జిల్లా కబడ్డీ జట్లకు సత్య డిగ్రీ, పిజి కళాశాల విద్యార్థులు ఐదుగురు ఎంపికయ్యారు. నీలిమ, శ్రీవల్లి, సేతు మాధవి, వరలక్ష్మి, జనార్దన్ ఎంపిక కావడంతో వారిని కళాశాల డైరెక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవి సాయి దేవమణి ఆదివారం అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి ఆఫీసర్లు కెప్టెన్ ఎం.సత్యవేణి, లెఫ్టినెంట్ ఎం.ఉదయ్ కిరణ్, ఫిజికల్ డైరెక్టర్ ఎస్‌హెచ్‌హెచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

సమాజ అభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమాజ అభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకమని కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అన్నారు. నగరంలోని జెడ్‌పి సమావేశ మందిరంలో ఎపియుడబ్ల్యుజె ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం జిల్లా అధ్యక్షులు మహాపాత్రో అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జర్నలిజం వృత్తి సవాళ్లతో కూడుకున్నదని అన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తాను సిద్ధంగా ఉన్నానని, నగరంలోని జర్నలిస్టుల ఆరోగ్య బీమా ప్రీమియం చెల్లించేందుకు ఆయన హామీ ఇచ్చారు. ఎస్‌పి వకుల్ జిందల్ మాట్లాడుతూ జర్నలిస్టులకు త్వరలో క్యూఆర్ కోడ్‌తో కూడిన వెహికల్ స్టిక్కర్లను.. నకిలీల నిరోధానికి మంజూరు చేస్తామని ప్రకటించారు. అనంతరం ఎటికె స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఖలీల్ బాబు మాట్లాడారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులను సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పిఎస్‌వి ప్రసాద్, నాయకులు ఎంఎస్‌ఎన్ రాజు, పంచాది అప్పారావు, రాము పాల్గొన్నారు.

చిరు అభిమానుల రక్తదానం

విజయనగరంటౌన్ : మెగాస్టార్ చిరంజీవి జన్మదినోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం జిల్లా మెగా ఫ్యామిలీ సేవా సంఘం ఆధ్వర్యంలో న్యూ లైఫ్ బ్లడ్ బ్యాంకులో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జనసేన నాయకులు అవనాపు విక్రమ్ ప్రారంభించారు. సంఘం అధ్యక్షులు రాంకీ ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో చిరంజీవి అభిమానులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు.